

భారీ వర్షం : రోడ్లన్నీ జలమయం



జలమయమైన రహదారి

మండవల్లి : మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి ఉక్కపోత ఉండగా సాయంత్రం 4:20 సమయంలో భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నరసేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండవల్లిలోని జగనన్న కాలనీతో పాటు బిసి, ఎస్సి కాలనీ, కైకలూరు సంత రోడ్లపైకి వర్షపు నీరు చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పాముర్రు, దిగమర్రు జాతీయ రహదారిపై భారీ స్థాయిలో వర్షపు నీరు నిలిచి రహదారి చెరువును తలపించింది. వర్షపు నీటిలో వాహనదారులు ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు.

ఉలికిపాటు..

- రాయవరం ఘటనతో రెండు జిల్లాల ప్రజల్లోనూ కలవరం
- గత ప్రమాదాలను గుర్తు తెచ్చుకున్న జనం

దీపావళి అంటే దీపాల పండుగ. దాని స్థానంలో బాణసంచా కాల్చుల మోత పెరగడంతో ఎక్కడికక్కడ బాణసంచా తయారీ కేంద్రాలు వెలిశాయి. ప్రతి సంవత్సరం దీపావళి పండుగకు రెండు నెలల ముందు నుంచి ఈ తయారీ కేంద్రాలు కూలీలతో కిటకిటలాడుతుంటాయి. ప్రమాదపు అంచున పని చేస్తున్నామని తెలిసినా వ్యవసాయ పనులు తగ్గడం, ఉపాధి లేకపోవడంతో అనివార్యంగా బాణసంచా తయారీ కేంద్రంలో పనులకు మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లడం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో అక్కడ చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో పెద్దసంఖ్యలో కూలీలు మృతి చెందడం అందరిని కలిచివేస్తోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం చోటుచేసుకున్న ప్రమాదం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లావాసులను ఉలికిపాటుకు గురి చేసింది. ఈ ఘటనతో జిల్లాలో అధికారులు బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు ప్రారంభించారు. అయితే ఇవి తూతూమంత్రపు చర్యగా ఉంటే జిల్లాలోనూ రాయవరం వంటి ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో రెండు జిల్లాల్లో గతంలో చోటుచేసుకున్న ఘటనలు జిల్లా వాసుల కళ్లముందు కదలాడాయి. ఆ వివరాలు ఘటనల వారీగా...



ఏడు కుటుంబాలపై పిడుగు.. ★★★

తణుకు: తెల్లవారితే దీపావళి. 2024 అక్టోబర్ 30వ తేదీ. ఆ బాణసంచా తయారీ కేంద్రంలో పని చేసే మహిళలు త్వరగా పని ముగించుకుని ఇంటికి వెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. అదే సమయంలో తాము పనిచేసే తయారీ కేంద్రానికి ఆనుకుని ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగులు పడటం, ఆ నిప్పురవ్వలు తయారీ కేంద్రంపై పడి బాణసంచాకు నిప్పంటుకోవడం క్షణాల్లో జరిగిపోయింది. దీంతో భారీ పేలుడుతో ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. అక్కడ పని చేసేవారు అక్కడి నుంచి బయటపడే ప్రయత్నంలోనే ఇద్దరు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మరో పది మంది స్వల్ప గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురు కొద్దిరోజులకే పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పయారు. ఈ ఘటన దువ్వకు సమీపంలోని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం శివార్లలో చోటుచేసుకున్నా మృతులంతా పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు మండలం దువ్వ, పెంటపాడు మండలం రావిపాడు గ్రామాలవాసులే. అంతకుముందు సంవత్సరం ఈ తయారీ కేంద్రాన్ని దువ్వలోనే అదే గ్రామానికి చెందిన వేగిరోతు శివ నిర్వహిస్తుండగా అధికారులు లైసెన్స్ రెన్యువల్ చేయలేదు. దీంతో తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనుమతులు తెచ్చుకుని సూర్యారావుపాలెంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో దువ్వ, రావిపాడు గ్రామాల మహిళలు అక్కడ పనికెళ్లి మృత్యువాత పడ్డారు.

ఘటనలెన్నో.. పర్యవేక్షణ మాత్రం శూన్యం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో బాణసంచా పేలి ప్రాణాలు కోల్పోవడం, గాయపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొత్తోట పంచాయతీలో సుమారు ఆరేళ్ల కిందట షెడ్డులో భద్రపరిచిన బాణసంచా సామగ్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో అక్కడే ఉన్న ఆ షెడ్డు యజమానులు గాయాల పాలయ్యారు. సుమారు ఐదేళ్ల క్రితం పేరుపాలెం నార్త్‌లో యువతి టపాకాయలు కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని అక్కడే ఉన్న బాణసంచాకు నిప్పంటుకుని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఆ యువతి గాయాల పాలై కోలుకోగా, ఆ సమయంలో అక్కడే ఉన్న మూడేళ్ల చిన్నారి తీవ్ర గాయాలపాలైంది. కుటుంబ సభ్యులు ఆమెను భీమవరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది.

బాణసంచా తయారీకి దూరమైన పెదవెల్లమిల్లి.. ★★★

ఉంగుటూరు: ఇప్పటికి సుమారు 15 ఏళ్లుగా ఆ గ్రామంలో బాణసంచా అంటే హడలిపోతారంటే అతిశయోక్తి కాదు. 2010 ఆగస్టు పదో తేదీన చోటుచేసుకున్న దారుణ ఘటన పెదవెల్లమిల్లివాసుల కళ్ల ముందు కదలాడుతుంది. మండలంలోని పెదవెల్లమిల్లిలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది సజీవదహనమయ్యారు. దీపావళి టపాసుల తయారీని ఆ గ్రామంలో కుటీర పరిశ్రమగా చాలాకాలం నుండి అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే 2010 ఆగస్టు పదో తేదీన పట్టపగలు సుమారు వంద కేజీల బరువు గల వాటిని టపాసుల కట్టే మహిళలకు ఇచ్చేందుకు నాపరాయి నేలపై పెట్టి జనుప కంచంతో కొట్టుస్తుండగా అది నాపరాయికి తగిలి బాణాసంచా మందు విస్ఫోటనంతో అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. ఆ పేలుడు తాకిడికి మరో ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. భారీ విస్ఫోటనం కారణంగా నాలుగు నివాస గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీనిపై అప్పటి చేబ్రోలు ఎస్ఐ సుబ్బారావు, ఇతర అధికారులు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆ గ్రామంలో టపాసుల తయారీ అనే మాట విన్పించడం లేదు.

కడియద్దలో కాళరాత్రి.. ★★★

తాడేపల్లిగూడెం: 2022 నవంబర్ 10వ తేదీ రాత్రి కడియద్ద గ్రామస్తులకు కాళరాత్రిగా మిగిలిపోయింది. ఆ గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో తీవ్ర గాయాలతో తర్వాత మరణించారు. అప్పటిరం అనే వ్యక్తికి సంబంధించిన బాణసంచా తయారీ కేంద్రంలో పరిమితికి మించి నిల్వలు ఉండటం, ఆ సామగ్రిని అక్కడి నుంచి తరలించే ప్రయత్నంలో విస్ఫోటనం సంభవించి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలకు విన్పించేలా పేలుడు శబ్దాలు, ప్రకంపనలు చోటుచేసుకున్నాయంటే ప్రమాద తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు వలస కూలీలే కావడం గమనార్హం.

రక్షణ చర్యలు అరకొరే..!.. ★★★

పెనుమంట్ర: మండలంలోని దీపావళి మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలు లేవుగాని, హోల్‌సేల్ దుకాణాలు ఎక్కువగానే ఉన్నాయి. అయితే వాటిలో భద్రతా చర్యలు అంతంతమాత్రమేనని ఆరోపణలు విన్పిస్తున్నాయి. మార్టేరు నుండి వెలగలేరు వెళ్లే రోడ్డులో ఒక బాణసంచా హోల్‌సేల్ దుకాణం ఇంచుమించు జనావాసాలకు దగ్గరగా ఉంది. ఆ షాప్ పక్కనే ఉన్న రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలమూరు వద్ద ఉన్న బాణసంచా హోల్‌సేల్ దుకాణానికి కూతవేటు దూరంలో పెట్రోల్ బంక్ ఉంది. గత సంవత్సరం ఆ దుకాణంలోనే వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో నిప్పురవ్వలు ఎగసిపడి బాణసంచా పేలుడు చోటుచేసుకుంది. ఆ సమయంలో అక్కడ జనం పెద్దగా లేకపోవడంతో ప్రాణనష్టం సంభవించలేదు. ఈ పరిస్థితుల్లో అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

బాణసంచా తయారీ కేంద్రాల్లేవు.. గొడౌన్లే ఉన్నాయి

పి.శ్రీనివాస్, ఏలూరు జిల్లా అగ్నిమాపక అధికారి

ఏలూరు జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు లేవు. గొడౌన్లు మాత్రమే ఉన్నాయి. నూజివీడులో రెండు, కైకలూరులో ఒకటి, భీమడోలులో ఒకటి, ఏలూరు పరిసర ప్రాంతాల్లో రెండు ఉన్నాయి. ఇవన్నీ జనావాసాలకు దూరంగా ఊరి బయట ఉన్నాయి. ఈ గొడౌన్ల నిర్వాహకులు వారంతా కేంద్ర ప్రభుత్వం నుంచి లైసెన్సు పొంది ఉన్నారు. నీటి పంపులు, నీటి స్టోరేజీ, అగ్నిమాపక నిబంధనలతోపాటు అన్ని జాగ్రత్తలూ గొడౌన్లలో తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే అన్నీ ఒకసారి పరిశీలించాం. రెండు రోజుల్లో మరోసారి తనిఖీ చేస్తాం.

కోకో నాణ్యతపై రైతులు దృష్టి పెట్టాలి

రూ.12 కోట్లతో రైతులకు ఆధునిక పరికరాలు - కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరుసిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దేశంలోనే ఏలూరు జిల్లా కోకో సాగులో మొదటి స్థానంలో ఉందని, అదే స్థాయి నాణ్యతలోనూ ఉండేలా రైతులు చూడాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. జిల్లాలో 36,150 ఎకరాల్లో కోకో సాగు ఉందని, మరో మూడు వేల ఎకరాల్లో సాగు విస్తరించాలని అన్నారు. కొబ్బరితోపాటు ఆయిల్ పామ్‌లోనూ కోకో అంతర సాగుగా చేపట్టి రైతులు అధిక లాభాలు పొందాలన్నారు. కోకో సాగు, మార్కెటింగులో రైతులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో కోకో ప్రాసెసింగు యూనిట్ల స్థాపనకు రైతులు ముందుకొస్తే అన్ని సౌకర్యాలూ కల్పిస్తామన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం కోకో సాగు, పంటకోత తర్వాత నిర్వహణలో ఆధునిక పద్ధతులపై ఒక రోజు వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నాణ్యమైన కోకో మంచి ధర పలుకుతుందన్నారు. జిల్లాలో ఎక్కువగా టి.నరసాపురం, పెదవేగి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాల్లో కోకో పంట ఎక్కువగా సాగులో ఉందన్నారు. అదేస్థాయిలో మిగిలిన మండలాల రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆధునిక పరికరాలు కోసం రూ.12 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. జిల్లాలో ఎన్ని కావాలంటే అన్ని ప్రాసెసింగు యూనిట్ల స్థాపనకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తామన్నారు. పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు చేస్తామని, మనతోపాటు మరికొందరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అన్నారు. పలువురు కోకో రైతులు మాట్లాడుతూ మాటలు చెప్పినట్లు, కాగితాలు మీద చూపించినట్లుగా క్షేత్రస్థాయిలో తమకు మేలు చేస్తే కోకోసాగుపై మరింత ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. విత్తనాలు, సాగు, మార్కెటింగ్ పలు సందేహాలను రైతులు వ్యక్తం చేయగా, అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎపిఎఫ్‌పిఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ జి.శేఖర్‌బాబు, జిల్లా ఉద్యాన శాఖాధికారి కె.షాజానాయక్, ఎపిఎంఐపి పీడీ డాక్టర్ ఎస్.రామ్మోహన్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, ఎపి ఫుడ్ ప్రాసెసింగు సొసైటీ పిఎంఎఫ్ ఎంఇ జోనల్ మేనేజర్ కెజె.మారుతి, ఏలూరు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాసు, డిఆర్‌పి హిమవాణి, శాస్త్రవేత్తలు పి.మాధవీలత, కె.రామచంద్రుడు, మండల ఉద్యాన శాఖాధికారులు, కోకోశాల ఫౌండర్ చాక్లెటు స్పెషలిస్టు నితిన్ కార్డియా, మోండలీజ్ కోకో కంపెనీ ప్రతినిధులు, కోకో రైతులు, జిల్లా ఉద్యాన శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు వీరోచిత పోరు

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

పలువురు మున్సిపల్ కార్మికులు యూనియన్‌లో చేరిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కార్మికులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు వీరోచిత పోరాటాలు నిర్వహిస్తుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో పలువురు మున్సిపల్ కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఉమామహేశ్వరరావు సిఐటియు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు వ్యక్తులపై నడిచే సంస్థ కాదని, మహనీయుల పోరాట వారసత్వం, త్యాగాల పునాదులపై ముందుకు సాగుతుందన్నారు. సిఐటియు పోరాటాల చరిత్ర కలిగి ఉందన్నారు. క్రమశిక్షణ తప్పిన ఏస్థాయి నాయకులపైనైనా చర్యలు తీసుకుని విలువలకు కట్టుబడి, నిబద్ధత చాటుతుందని, మున్సిపల్ వర్కర్లు, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపులో సిఐటియు పాత్ర ఎవరూ కాదనలేరని స్పష్టం చేశారు. ఉద్యమ ద్రోహులు నుండి ఉద్యమాన్ని కాపాడుకుంటూ కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తామన్నారు. సిఐటియులో చేరిన వారిలో ఎ.జాన్‌బాబు, కాళిదాసు, ఎం.సామ్రాజ్యం, ఎ.రామకృష్ణ, నరసింహ, ఎడ్ల గంగరాజు, ఎడ్ల యాకోబు, బట్టు రవి, గంగాధర్‌రావు, చిట్టయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, యూనియన్ జిల్లా కార్యదర్శి బాలరాజు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్, జె.గోపీ, పంపన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించాలి

కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన మతోన్మాద దాడిని ప్రజాస్వామికవాదులు అంతా ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ కోరారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, మతోన్మాదం నశించాలని, లౌకికవాదం వర్ధిల్లాలని నినదించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అభ్యుదయవాదులు, ప్రజాస్వామికవాదులు, వామపక్ష శక్తులపై మతోన్మాదుల దాడులు పెరిగాయ చెప్పారు. ఉన్మాదం పెరిగిపోవడంతో సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటుతో దాడి చేసేందుకు సిద్ధపడ్డారని అన్నారు. కల్బుర్గి, గౌరీ లంకేష్ వంటి వారిని భౌతికంగా అంతమొందించారని, భౌతిక దాడులతో అభ్యుదయ భావాలను నిలువరించలేరని హితవు పలికారు. భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొడతామన్నారు. సిపిఎం ఆందోళనకు జై భారత్ పార్టీ మద్దతు తెలిపింది. ఆ పార్టీ నాయకులు పాము రవీంద్రనాథ్, రాంబాబు, దేవరపల్లి రత్నబాబు, కనకరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, నాయకులు అరుణతార నాగేశ్వరరావు, ఎం.శ్యామలారాణి, లెనిన్, ఎం.ఇస్సాక్, జె.గోపీ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు: నినదిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై సుమోటోగా కేసు నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కెవి.రమణ డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ బుధవారం స్థానిక బోసు బొమ్మ సెంటర్లో నిరసన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నేతలు మంచిలి రాజు, మల్లేటి శ్రీను, సూదిపాము జయరాజు, మార్లపూడి సుబ్బారావు, వసంతాటి సత్య, పత్తిపాటి వెంకన్న, పెనుమాక వెంకటేశ్వరరావు, మద్రి శ్రీను, కొత్తూరు అబ్బులు పాల్గొన్నారు.

ముసునూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై సనాతన ధర్మం పేరుతో దాడి చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నత స్థానంలో ఉన్న న్యాయమూర్తిపై దాడి చేయడాన్ని ఖండించారు. మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతలు కంచర్ల రమేష్, కంచర్ల దుర్గారావు, పోతురాజు, శ్రీను, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రోడ్డు నిర్మాణం తక్షణం చేపట్టాలి

లేనిపక్షంలో రోడ్డును దిగ్బంధిస్తాం - సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



మాట్లాడుతున్న రవి

ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు నిర్మాణ పనులను తక్షణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమీప గ్రామాల ప్రజలను సమీకరించి రోడ్డును దిగ్బంధిస్తామని హెచ్చరించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లాలంటే రోడ్డు నరకప్రాయంగా మారిందని, దీనికి కారణం ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై పెద్ద గుంతలతో వాహనాలు సైతం ఆ గుంతల్లో ఇరుక్కుపోతున్నాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలూరు, విజయవాడ ఆస్పత్రులకు వెళ్లేవారు పడే బాధలు వర్ణనాతీతమని చెప్పారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఆడమిల్లి వద్ద దెబ్బతిన్న కల్వర్టుస్థానంలో కొత్తది రూ.2 లక్షలతో నిర్మించాల్సిఉండగా రూ.18 లక్షలు వెచ్చించి మట్టితో డైవర్షన్ ఏర్పాటు చేయడం ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు. తక్షణమే ఎంపీ, ఎంఎల్ఎ చొరవ చేసి ఈ రోడ్డు నిర్మాణ పనులు తక్షణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

చెకుముకి 35వ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు : రాష్ట్రస్థాయి చెకుముకి 35వ సంబరాల పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుటకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయని చెప్పారు. చెకుముకి సంబరాలలో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులందరూ తప్పక పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీన జరగనున్న స్కూల్ లెవెల్ చెకుముకి సంబరాలలో ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల వారు పాల్గొనాల్సిందిగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ చెకుముకి సంబరాల నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సహకరించి మీ స్కూలుకి కావలసిన పేపర్ల ఇండెంట్ కోసం సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శనివారపుపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రకాశ్, జెవివి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్.రమేష్, జిల్లా అధ్యక్షులు ఒవి.ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణరావు, కోశాధికారి అఖిల్, జిల్లా ఉపాధ్యక్షులు ఐవి.సుధాకర్, జిల్లా కార్యదర్శులు బోడెం శ్రీనివాస్, మోహనరావు, జిల్లా కోశాధికారి అఖిల్ పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒచే పలు హాస్టళ్ల పరిశీలన

బుట్టాయగూడెం : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులు పచ్చ కామెర్లతో మృతిచెందడంతో బుధవారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ అధికారి, ఐటిడిఎ కోట రామచంద్రపురం ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్ పలు హాస్టల్స్‌ను సందర్శించారు. నూతిరామన్నపాలెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, రాజానగరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కోట రామచంద్రాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ కళాశాల హాస్టళ్లలో మరుగుదొడ్లు, వంటగది, వాటర్ ట్యాంక్‌లు, విద్యార్థుల స్నాన గదులను పరిశీలించారు. బోర్‌వెల్ నీటి నమూనాను పరీక్షార్థం బుట్టాయగూడెం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పంపవలసిందిగా ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్న గమనించి తక్షణమే వైద్యం అందించాలని, పరిసరాల పరిశుభ్రత కు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు.

ఐద్వా రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలా రాణి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలా రాణి పిలుపునిచ్చారు. మండలంలోని అల్లూరు సీతారామరాజు నగర్(కృష్ణాపురం మెట్ట)లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐద్వా మండల అధ్యక్షురాలు మడకం కుమారి అధ్యక్షత వహించగా మహాసభల సందర్భంగా ఆర్.భద్రకాళి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ సభలకు ప్రజల తరపున, మహిళల తరపున పోరాడుతున్న జాతీయ నాయకులు, రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, 13వ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలో మూడేళ్ల కాలంలో ఉద్యమ అనుభవాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణకు పిలుపునిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.మంగ, ఎం.శిరీష, ఎస్‌కె.గాయత్రి, బి.ముత్తమ్మ, ముత్యాలమ్మ, బి.కుమారి, ఎం.సమ్మక్క, బేబీ షామిలి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపును వినియోగించుకోండి

పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్

ముదినేపల్లి : జాతీయ తపాలా వారోత్సవాలు 2025 సందర్భంగా పోస్టల్ శాఖ వారిచే నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ 2025 పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 10, 11 తేదీల్లో ఉదయం 8 గంటల నుండి ముదినేపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించే ఆధార్ క్యాంపులో ఉచిత ఆధార్ నమోదుతో పాటు 5 - 7 సంవత్సరాల పిల్లలకు, 15-17 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్స్ తదితర అన్ని రకాల ఆధార్ సేవలు అందించబడతాయని తెలిపారు.

జిజిహెచ్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీ

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని పలు విభాగాలను డాగ్‌స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. జిజిహెచ్‌లోని అత్యవసర సేవల విభాగం వైపు నుంచి లోపల ఎమర్జెన్సీ వార్డులు, ఇతర విభాగాల్లోనూ తనిఖీలు చేశారు. జిజిహెచ్ ప్రాంగణంలోనూ, అన్ని విభాగాల్లోనూ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దీనిపై ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనుల ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు



గేటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నేతలు, అధికారులు

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు రైల్వేట్రాక్, జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ రూ.450 కోట్ల వ్యయంతో ఫ్లయ్ ఓవర్లు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ, పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అభినందించారు. సదరు నిర్మాణాలకు భీమడోలు మండలంలో ప్రతిపాదించిన స్థలాలు, ఇతరాలను రైల్వే శాఖ, జాతీయ రహదారులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో కూడిన బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పూళ్ల, పి.కన్నాపురం మధ్య 364 ఎ రైల్వేగేట్ మూసివేత ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గ్రామస్తులు తమ ఇబ్బందులను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. ఆ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి లేదా ఫ్లయ్ ఓవర్ నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు మాట్లాడుతూ, సదరు రైల్వేగేట్ సమీపంలోని కోడూరుపాడు రైల్వేగేట్ వద్ద ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం జరుగుతుందని, వాహనాలు, రైతులు దాని సేవలు వినియోగించుకొనేందుకు అవసరమైన ఏర్పాటు చేయడంతోపాటు, కనెక్టివిటీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. మూసివేత ప్రతిపాదన గల 364ఎ రైల్వేగేట్ వద్ద పాదచారులు, మోటార్ వాహనాలు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని తెలిపారు. ఇదేవిధంగా భీమడోలు రైల్వే గేట్ వద్ద నిర్మించనున్న ఫ్లయ్ ఓవర్ అబౌవ్ రైల్వే ట్రాక్ నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, వీటిని తొలుత రైల్వే శాఖ పరిశీలించి అనుమతించిన తర్వాత జాతీయ రహదారుల శాఖ ఆ ప్రతిపాదనలను పరిశీలించి తుది అనుమతులు ఇచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో పనులు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ అంబరీష్, భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి, వివిధ శాఖల అధికారులతోపాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ అభినందనీయం : కోచ్

చింతలపూడి : విద్యార్థులు కరాటేలో మాత్రమే కాక మిగిలిన ఆత్మరక్షణ విద్యల్లో కూడా ప్రతిభ కనబరచడం అభినందనీయమని కోచ్ సుమన్ రాజు తెలిపారు. బుధవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన త్రైలాంటో క్రీడలో చింతలపూడి పుస్పా స్పోర్ట్స్ కరాటే అకాడమీకి చెందిన బండి జస్వంత్ అండర్ 17 విభాగంలో స్వర్ణ పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ పోటీలలో జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ అలివేలు మంగ హాజరై క్రీడాకారులను అభినందించారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

కుక్కునూరు : మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒ(1) కృష్ణ ప్రసాద్ మండల కేంద్రంలోని రామసింగారం ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను జాగ్రత్తగా పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల రికార్డులను సమీక్షించి, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఆదేశించారు. విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమం పట్ల కృష్ణప్రసాద్ చూపిన శ్రద్ధ పాఠశాల యాజమాన్యానికి స్ఫూర్తినిచ్చింది.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

దెందులూరు: తమ స్నేహితుడు మృతిచెందడంతో కుటుంబానికి గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000 పదవ తరగతి పూర్వ విద్యార్థులు చేయూతనిచ్చారు. గోపన్నపాలెం పంచాయతీ, మసీదుపాడు గ్రామం చెందిన కె.సువర్ణ రాజు అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతిచెందారు. మిత్రుడు సువర్ణ రాజు ఆసుపత్రిలో ఉన్న సమయంలో వైద్య నిమిత్తం రూ.56 వేలు గతంలో 10వ తరగతి మిత్రులు అందరు తమవంతు ఆర్థిక సహాయం చేసి వైద్య నిమిత్త అందజేశారు. మిత్రుడు సువర్ణరాజు తన తల్లికి ఒకే కుమారుడు అవ్వడం వల్ల తల్లి అవస్థలు చూడలేక సువర్ణ రాజు మిత్రులు మరొకసారి మానవత్వంతో 25 కేజీల బియ్యం, ఒక నెలకు సరిపడా సరుకులు, కొద్ది మొత్తం ఆర్థిక సహాయం, మిత్రులతో దిగిన గ్రూప్ ఫోటో అందజేసి మేము ఉన్నాము అంటూ చేయూతనిచ్చారు.

బురద చల్లాలని చూస్తే ఊరుకోం

టిడిపి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు

మండవల్లి : కూటమి నాయకులపై బురద చల్లాలని చూస్తే సహించేది లేదని టిడిపి మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు(కొండ) స్పష్టం చేశారు. స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కూటమి నాయకులపై విమర్శలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన రీతిగా కూటమి నాయకులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలను సకాలంలో అర్హులందరికి అందేలా చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గుడివాడ విధిబాబు, బోయిన రాజేష్, బోయిని సురేష్, కోసూరి కోటేశ్వరరావు, విజయ్ పాల్గొన్నారు.

'డాక్టర్ సునీత సేవలు అభినందనీయం'

భీమడోలు: భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వివిధ కారణాల వల్ల వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్నటువంటి వైద్యులు, సిబ్బంది సహాయ సహకారాలతో పూర్తిస్థాయి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఎస్.సునీత సేవలు అభినందనీయమని గ్రామ ప్రముఖులతో పాటు, కూటమి నాయకులు, ఆరోగ్య కేంద్రానికి చెందిన అధికారులు, సిబ్బంది అన్నారు. స్వస్థ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో తాను అందజేస్తున్న సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయిలో స్వస్థ సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఎంపికైంది. ఈ మేరకు సునీత మెమెంటో, సర్టిఫికేటును జిల్లా కలెక్టర్తో పాటు, జిల్లా ఆసుపత్రి సేవ సమన్వయకర్త డాక్టర్ పాల్ సతీష్ కుమార్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ క్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం నాగబాబుతో పాటు కూటమి నాయకులు, స్థానిక ప్రముఖులు, సిబ్బంది సునీతను సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్పి విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున మంగళవారం వీరవాసరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలలో జంగారెడ్డిగూడెం బాయ్స్ హైస్కూల్కి చెందిన తొమ్మిదో తరగతికి చెందిన కొప్పుల కీర్తన అండర్-17లో, 7వ తరగతికి చెందిన గణపవరపు సాయి ధాత్రి అండర్-14 కేటగిరీలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సంపాదించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు పి.సోమశేఖర్ మాట్లాడుతూ ఈ డివిజన్ ఫెన్సింగ్ పోటీలో మొట్టమొదటిసారిగా తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పిఇటిలకు డైరెక్టర్ భూదేవి, సతీష్ గారిలను ఆయన అభినందించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ పిల్లల్ని అభినందిస్తూ వీరు జాతీయస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభను ప్రదర్శించి భారత దేశ డ్రీమ్ టీమ్లో ఉంటారని అభిలషించారు. పాఠశాల స్టాఫ్ అసిస్టెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

నూజివీడు టౌన్ : నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ సిబ్బంది కేవలం ముగ్గురు ఉండగా, ప్రయివేట్ సిబ్బంది అంతకుమించి ఉండడాన్ని సబ్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. కార్యాలయానికి వచ్చే కక్షిదారులకు కార్ పార్కింగ్ లేకపోవడం, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఆరా తీశారు. తమకు ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలుస్తోంది.

వసతి గృహాల్లో శానిటేషన్ డ్రైవ్

జీలుగుమిల్లి : మండలంలోని బర్రింకలపాడు గిరిజన గురుకుల వసతి గృహం, జీలుగుమిల్లి, గిరిజన ఆశ్రమ బాలుర, వసతి గృహం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో బుధవారం ప్రత్యేక శానిటేషన్ పనులు చేపట్టినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తున్నందున వసతి గృహాల్లో ఉండే పిల్లలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శానిటేషన్ పనులు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వసతి గృహాల్లో దోమల నివారణకు గాను మలాథియాన్ పిచికారీ చేయించినట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

చింతలపూడి : ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మరణించిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. చింతలపూడి ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కంచనగూడెం గ్రామానికి చెందిన మానేపల్లి రవి(43) దేశవరం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆపి పక్కకు వెళుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి పంపించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

9 మంది అరెస్ట్

మండవల్లి: గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేసి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉనికిలి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం గుట్టు చప్పుడు కాకుండా భారీ స్థాయిలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చిందన్నారు. పేకాట శిబిరం వద్దకు చేరుకొని దాడి చేయగా పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, వారి వద్ద నుండి రూ.10,3,510 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కైకలూరు న్యాయస్థానంలో హాజరు పర్చనున్నామని ఆయన తెలిపారు.

యువకునికి రిమాండ్

ముదినేపల్లి : ఓ యువతిని ప్రేమించి పెళ్లాడతానని నమ్మించి మోసం చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. కొయ్యలగూడెం మండలానికి చెందిన అంబర్తి దివాకర్(20) మండలంలోని చేవూరుకు చెందిన యువతిని గుడివాడ పాలిటెక్నిక్ కాలేజీలో అడ్మిషన్ చేయిస్తానని పరిచయమై ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఈ విషయమై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఏలూరులోని హనుమాన్ బ్రిడ్జి వద్ద దివాకర్ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కైకలూరు కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన బాలుడు కుంజ ప్రణీత్, కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

గత 14 సంవత్సరాలుగా కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేకుండా ఉన్న కుంజ ప్రణీత్, కుటుంబ సభ్యులు వాటిని మంజూరు చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేకుండా ఇబ్బంది పడుతున్న కుంజ ప్రణీత్కు న్యాయం చేయాలన్నారు. ప్రణీత్ తండ్రి సోమరాజు 2014లో స్కూల్ టీచర్గా పనిచేస్తున్న సమయంలో విద్యార్థినిగా ఉన్న ప్రమీల రాణిని మాయమాటలు చెప్పి తల్లిని చేశాడు. ఆ కేసులో కుంజ సోమరాజుకు హైకోర్టు శిక్ష వేసింది. సోమరాజు గిరిజనుడు కావడంతో అతనికి పుట్టిన కొడుకు కూడా గిరిజనుడే అవుతాడు కాబట్టి ప్రణీత్కి ఎస్టి సర్టిఫికెట్ జారీ చేయాలని నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలాగా తిరిగి విసిగిపోయి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఐటిడిఎ కోట రామచంద్రపురం లో గిరిజన సమస్యలను పరిష్కరించడం కోసం వినతి పత్రాలు తీసుకుంటున్న జాతీయ ఎస్సి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్కు కుల ధృవీకరణ పత్రం సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రణీత్ వినతిపత్రాన్ని అందజేశారు. బుట్టాయిగూడెం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ గత సంవత్సరకాలంగా తిరుగుతూనే ఉన్నా కనీసం సమాధానం కూడా చెప్పడం లేదని ఈ సందర్భంగా అన్నారు. కుంజ ప్రణీత్కు కులధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు. 14 సంవత్సరాలుగా ఎటువంటి గుర్తింపు కార్డు లేకుండా తీవ్ర ఇబ్బంది పడుతున్న బాలుడి సమస్యను పరిష్కరించాలని అన్నారు.

ఎల్టిఆర్ పోడు భూములకు పట్టాలివ్వాలి

మండల మహాసభలో వ్యకాస నేతలు

ప్రజాశక్తి - బుట్టాయిగూడెం

ఎల్టిఆర్ పోడు భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సంఘం పదవ మండల మహాసభ స్థానిక ఆదివాసి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ మహాసభకు మడవి రాము అధ్యక్షత వహించగా ముందుగా సంఘం జెండాను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ ఎగరవేశారు. అనంతరం జరిగిన మండల మహాసభలో మూడు సంవత్సరాల కాల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ, సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో గిరిజనులకు ఆసరాగా ఉన్న 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేయటానికి కుట్రలు పన్నుతున్నాయని, ఈ పన్నాగాన్ని గిరిజనులు, పేదలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గిరిజన ఏరియాలో భూములను, కొండలను విలువైన సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెట్టడానికి చట్టాలు తయారు చేస్తున్నారని, తక్షణమే విరమించుకోవాలని, లేదంటే బిజెపి, కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనుల సాగులో ఉన్న ఎల్టిఆర్ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ పేదలకు పట్టాలు ఇవ్వకుండా దున్నపోతు మీద వాన కురిసినట్టు ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాగే సంఘం పోరాటాల ఫలితంగా ఉపాధి చట్టం వచ్చిందని, దాన్ని ప్రతిష్టంగా అమలు చేయకుండా నిర్వీర్యం చేయటానికి కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. రెండు వందల రోజులు పనులు పెంచి రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం 17 మందితో మండల కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా మడవి రాము, కార్యదర్శిగా ఉడత వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించి వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.


ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మడవి రాముకుడత వెంకటేష్

'సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు పోరాడాలి'

జీలుగుమిల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకై కార్మికులందరూ మరో పోరాటం ప్రారంభించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు అన్నారు. మండలంలోని ములగంపల్లి ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) ద్వితీయ వార్షికోత్సవ జనరల్ బాడీ సమావేశం చిట్టి కొమ్ము కొండలరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా ప్రదర్శన, ర్యాలీ జరిపి అనంతరం జెండా ఆవిష్కరణతో సభ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణారావు మాట్లాడుతూ ఆటో కార్మికుల కోసం గత వైసిపి ప్రభుత్వం, నేటి టిడిపి కూటమి ప్రభుత్వం రూ.436 కోట్లు అప్పులు చేసి ఇస్తున్నట్లు అంటున్నారని, ప్రభుత్వానికి నయా పైసా ఖర్చు లేకుండా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో రూ.3,600 కోట్లు నిల్వ ఉందన్నారు. అయినప్పటికీ నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడం లేదని నాయకులు ఆరోపిస్తూ సంక్షేమ బోర్డు పునరుద్ధరించే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. నిర్మాణ కార్మికుల ద్వితీయ వార్షికోత్సవం జరిపిన ములగంపల్లి ఏరియా యూనియన్ కమిటీ సభ్యులుకు అభినందనలు తెలియజేశారు. సిఐటియు ఆల్ ఇండియా జాతీయ 18వ మహాసభలు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

చింతలపూడి : ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ తెలిపారు. చింతలపూడి ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్ఐ సతీష్ కుమార్ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి చింతలపూడి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించిన, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించి, వారిచే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. వాటికి ఆకర్షితులవుతున్న వారిలో ఎక్కువ శాతం మంది యువత, విద్యార్థులే ఉన్నారన్నారని అన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, అక్రమరవాణా, వినియోగం చట్టప్రకారం నేరమన్నారు. ఈ చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. సమాచారాన్ని ఇచ్చిన వారి వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతామన్నారు. ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల సైబర్ నేరగాళ్లకు వరప్రదాయనిగా మారిందని అన్నారు. మీరు, మీ చుట్టుపక్కల వారు గాని ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930కు సమాచారం అందించిన ఎడల అధికారులు మీకు సహాయ, సహకారాలు అందిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో చంద్రపురి సతీష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ క్రాంతికుమార్

ప్రజా సమస్యలు విస్మరించిన కూటమి ప్రభుత్వం : సిపిఎం

టి.నరసాపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాన సమస్యలు విస్మరించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సిపిఎం మండల కమిటీ సమావేశం బొద్దుల గంగా భవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల ప్రధాన సమస్యలైన రహదారుల నిర్మాణాలను విస్మరించిందని, ఏవూరికి వెళ్లాలన్నా సరైన రహదారులు లేవని, మండలంలోని లక్ష్మీపురం నుండి టి.నర్సాపురం కేంద్రానికి వెళ్లే రోడ్డు, చింతలపూడి కనెక్టింగ్ రోడ్డు, మక్కినవారిగూడెం వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. మండలంలో మారుమూల గ్రామాలకు వెళ్లటానికి సైతం రహదారులు లేవని, ప్రస్తుతం ఉన్నటువంటి రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయని వాపోయారు. మండలంలోని రహదారులపై పరిమితికి మించిన ఇసుక లారీలు, పామాయిల్ లారీలు తిరగడం వల్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతిని పోయాయని, లక్ష్మీపురం నుంచి టి.నర్సాపురం వైపు వెళ్లే ఇసుక లారీలను అధికారులు తనిఖీలు చేయాలని, పరిమితికి మించిన లారీలు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకటరావు మాట్లాడుతూ మండలంలో రోడ్ల సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్ల సమస్యను పరిష్కారం చేయకపోతే సిపిఎం ప్రజల పక్షాన ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు దిగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మడకం కుమారి, శిరీష, పూసం సూర్యారావు, అనుములు మురళీ, సోయం దుర్గమ్మ, బరగడ కుమారి పాల్గొన్నారు.

ఆటో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి

సిఐటియు మండల కన్వీనర్ యర్నం సాయికిరణ్

కుక్కునూరు రూరల్ : అక్రమ కట్టడాలకు ఉన్న స్థలం ఆటో పార్కింగ్కి లేదా అని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. బుధవారం నాడు అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాలు కార్యాలయంలో పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మండలంలో 100 మందికిపైగా ఆటో డ్రైవర్లుగా, ప్రమాదం అంచున నిత్యం స్థానిక ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. అసలే ఆటో డ్రైవర్లకు సర్వీస్ లేక కుటుంబ పోషణ గడవక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మండల కేంద్రంలో ఆటో పార్కింగ్, పికపింగ్, డ్రాపింగ్ పాయింట్స్ లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ఆటో పార్కింగ్ చేసుకోడానికి స్థలం ఏర్పాటు చేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షులు కృష్ణ, ఆటో డ్రైవర్లు రాము, మహేష్, మనోజ్, అశోక్, బాలు, వెంకన్న, ఉదయ్ పాల్గొన్నారు.

విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి విరాళం

ముదినేపల్లి : గ్రామానికి ఉపయోగపడే విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి దాత ముందుకు వచ్చి విరాళం అందజేయడం అభినందనీయమని సింగరాయపాలెం గ్రామ సర్పంచి బోయిన విమలరామరాజు అన్నారు. మండలంలోని సింగరాయపాలెం శ్మశానంలో పంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి గ్రామానికి చెందిన తోలేటి కృష్ణమోహన్ జ్ఞాపకార్థం ఆయన భార్య తోలేటి రాజ్యలక్ష్మి, కుమారులు తోలేటి వీరభద్ర శర్మ, తోలేటి శివరామకృష్ణ బుధవారం గ్రామ సచివాలయంలో సర్పంచి విమల రామరాజు, పంచాయతీ కార్యదర్శి సీతారామరాజులకు రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. శ్మశానంలో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి తోలేటి కృష్ణమోహన్ కుమారులు ముందుకు వచ్చి ఈవిధంగా విరాళం అందజేయడం పట్ల గ్రామస్తులు దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


సహకారం అందజేస్తున్న దాత

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ దగ్గర నుంచి శ్రీనివాసపురం జంక్షన్ వరకు బిటి రోడ్డు పనులకు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ థియేటర్ దగ్గర నుంచి పురపాలక సంఘం నిధులు నుంచి ఏరియా ఆసుపత్రి మీదుగా శ్రీనివాసపురం జంక్షన్ వరకు మున్సిపాలిటీ నిధుల నుంచి రూ.కోటి 40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎంఎల్ఎ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్కుమార్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. పది కాలాల పాటు ధృఢంగా ఉండే విధంగా నాణ్యతా ప్రమాణాలతో రహదారి నిర్మించాలన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు.

జిఎస్టి 2.0పై అవగాహన

భీమడోలు : జిఎస్టి 2.0 అమలు ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని కమర్షియల్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ధనేశ్వరరావు అన్నారు. భీమడోలులోని మాధురి జూనియర్ కాలేజ్ ఆవరణలో కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమకుమార్ ఆధ్వర్యంలో బుధవారం సూపర్ జిఎస్టి, సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ తగ్గిన జిఎస్టి వల్ల ధరలు తగ్గి, ప్రజల ఆర్థిక పరిస్థితి బాగుంటుందన్నారు. సహాయ కమర్షియల్ టాక్స్ అధికారి గోపికృష్ణ మాట్లాడుతూ జిఎస్టి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎంపిడిఒ పద్మావతి దేవి ఆర్థిక సాక్షరత, ఇతర ప్రయోజనాల గురించి తెలియజేశారు. మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు తగ్గిన టాక్స్ వల్ల సామాన్యునికి కొన్ని వస్తువుల ధరలు అందుబాటులోకి వస్తాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తగ్గిన జిఎస్టి ప్రయోజనాలు పొందే నేపథ్యంలో విదేశీ వస్తువుల స్థానంలో స్వదేశీ ఉత్పత్తులను వినియోగించుకొని దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అశోక్, ఇన్ఛార్జి ప్రిన్సిపల్ బాలు, ప్రసాద్, సిఆర్పి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్

రోడ్ల అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి మంచి కృషి జరుగుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం నుండి రావికంపాడు వరకు రూ.4.22 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆర్అండ్బి రోడ్డుకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సౌకర్యం కోసం రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే ప్రజల ఆర్థికాభివృద్ధి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తి, అడపా నాగరాజు, నల్లూరివెంకట చలపతి రావు పాల్గొన్నారు.

13 ఏళ్లుగా కుల బహిష్కరణ

తాడువాయి గ్రామంలో చోటుచేసుకున్న ఘటన

జంగారెడ్డిగూడెం : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన బోజుల వెంకటేశ్వరరావు(65) గత 13 ఏళ్లుగా కుల బహిష్కరణకు గురైనట్లు తెలిపారు. తన ఇద్దరు కుమార్తెలు ప్రేమించి ఎస్సి కులానికి చెందిన వారిని వివాహం చేసుకోవడమే కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేపల వేటే ప్రధాన వృత్తిగా ఉన్న వడ్డీల(బిసి) కులానికి చెందిన 40 కుటుంబాలు ఆ గ్రామంలో ఉన్నప్పటికీ ఆయన కుటుంబాన్నే బహిష్కరించారని ఆయన తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం తన భార్య చనిపోయిందని, ఆ సమయంలో కూడా ఎవరూ తమ ఇంటి దగ్గరకు రాలేదన్నారు. తనను తిరిగి సంఘంలో చేర్చుకోవాలంటే పిల్లలతో సంబంధం తెంచుకోవాలని కుల పెద్దలు షరతు పెట్టారని, కానీ పిల్లల్ని వదిలి రాలేనని ఆయన వాపోయారు. స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా ఇంకా ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరం. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు

భీమడోలు : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో క్రీడాశక్తిని గుర్తించేందుకు, ప్రోత్సహించేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల సేవలను సద్వినియోగపరుచుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాసరావు కోరారు. భీమడోలు హై స్కూల్ వేదికగా బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఆరు గేమ్స్, అథ్లెటిక్స్, యోగా, చదరంగం విభాగాలలో పోటీలను నిర్వహించారు. పొలసానిపల్లిలోని బాలయోగి గురుకుల పాఠశాలతోపాటు మండల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 280 మంది క్రీడాకారులు వివిధ పోటీలలో పాల్గొన్నారు. పోటీలను మండల విద్యాధికారితో పాటు, భీమడోలు హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజ సంయుక్తంగా ప్రారంభించారు.

'స్పష్టమైన దృష్టికి కంటి జాగ్రత్తలు అవసరం'

దెందులూరు : స్పష్టమైన దృష్టికి కంటి జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలని రవి కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ హేమలత అన్నారు. మండలంలోని పోతునూరు గ్రామంలో సొసైటీ బ్యాంకు వద్ద మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సొసైటీ బ్యాంకు అధ్యక్షులు బొడ్డేటి మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోతునూరు, కేధవరం ఉండ్రాజవరం గ్రామాల నుంచి 180 మంది కంటి వ్యాధి బాధితులు వైద్య శిబిరంలో వైద్య చికిత్సలు పొందారు. బాధితులకు కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 34 మందికి కళ్ల అద్దాలు, 22 మందికి కంటి ఆపరేషన్లకు తగు చర్యలు చేశారు.

'పూర్వ పోలీస్ అధికారుల సేవలు అభినందనీయం'

ఏలూరు స్పోర్ట్స్ : రాష్ట్రంలో పూర్వ పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని, సుదీర్ఘకాలం పాటు ప్రజాసేవకే అంకితమై పారదర్శకంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుకున్నారని ఏలూరు రేంజ్ ఐజీ జివిజి.అశోక్కుమార్ అన్నారు. ఏలూరులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌరవ అతిథులుగా మాజీ డిజిపిలు మాలకొండయ్య, పి.గౌతంకుమార్ హాజరయ్యారు. పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ అదనపు ఎస్పి కె.మాణిక్యాలరావు, డిప్యూటీ ఇంజనీర్ చందన విష్ణువర్ధన్, మాజీ పోలీస్ కానిస్టేబుల్ సయ్యద్ బాజీను ఘనంగా సత్కరించారు. అనంతరం అమీనాపేట సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్లోని 12 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 15 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎఎస్పి నక్కా సూర్యచంద్రరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు పివిఎస్కె.భగవాన్ రాజు, సంఘం కార్యదర్శి, మాజీ సిఐ ఎస్.దాశరధి, ట్రెజరర్ ఎల్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కె.రాజగోపాల్రావు హాజరయ్యారు.

కూరగాయల వితరణ

నూజివీడు టౌన్ : తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ తరపున మరీదు వెంకట కృష్ణ ప్రసాద్ బియ్యం, కూరగాయలు వితరణ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఛైర్మన్, రిటైర్డ్ తహశీల్దార్ పంద్రంగి సత్యనారాయణమూర్తి, బ్రహ్మచారి భాస్కరన్ స్వామీజీ మాట్లాడుతూ వయోవృద్ధులు, వికలాంగులు 40 మందికి నిత్యం అన్నదానం నిర్వహించటం జరుగుతుందన్నారు. సాయంత్రం వేళ మరో 40 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పడంతో పాటు భోజనం అందించడం జరుగుతుందన్నారు. తిరివీధి కృష్ణ, మరీదు వెంకటకృష్ణ ప్రసాద్, కుటుంబ సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అడవి బాపిరాజు జయంతి

కలిదిండి : బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రచయితగా, కళాకారునిగా, నాటకకర్తగా బాపిరాజు ప్రాముఖ్యతను విద్యార్థులకు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు వివరించారు. గ్రంథాలయ పాఠకులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.